Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
సామాన్యుని సమస్యలపై నిత్యం పోరాడే ఆయుధంగా.. జాతీయ తెలుగు దిన పత్రిక
మీ ప్రాంతంలో జరుగుతన్న అవినీతిని బయటపెట్టాలని ఉందా..
నిజాన్ని నిర్భయంగా చెప్పాలని ఉందా..
సంచలన కథనాలకు కేరాఫ్‌గా నిలిచిన ఇది కద నిజం
విలేఖరులు కావలెను
తెలంగాణ రాష్ట్రంలో సంచలనంగా దూసుకెళ్తున్న
ఇది కద నిజం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు
తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు, నియోజకవర్గాల
వారిగా విలేఖరులు కావలెను..
6300490170-9848983329
Www.edikadanijam.com
Edikadanijam@gmail.com
No Monthly Targets
* terms and conditions apply



Registered No : APTEL/25/A0818

# ఇది కద నిజం

సామాన్యుని సమస్యలపై నిత్యం పోరాడే ఆయుధంగా.. జాతీయ తెలుగు దిన పత్రిక



ఇది కద నిజం
సామాన్యుని సమస్యలపై నిత్యం పోరాడే ఆయుధంగా.. జాతీయ తెలుగు దిన పత్రిక
మీ ప్రాంతంలో జరుగుతన్న అవినీతిని బయటపెట్టాలని ఉందా..
నిజాన్ని నిర్భయంగా చెప్పాలని ఉందా..
సంచలన కథనాలకు కేరాఫ్‌గా నిలిచిన ఇది కద నిజం
విలేఖరులు కావలెను
తెలంగాణ రాష్ట్రంలో సంచలనంగా దూసుకెళ్తున్న
ఇది కద నిజం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు
తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు, నియోజకవర్గాల
వారిగా విలేఖరులు కావలెను..
6300490170-9848983329
Www.edikadanijam.com
Edikadanijam@gmail.com
No Monthly Targets
* terms and conditions apply



శుక్రవారం 26-06-2026 | పేజీలు : 4 | వెల : 2/- | సంపుటి :2 | సంచిక : 09 | www.edikadanijam.com | ఎడిటర్ : బాలరాజ్ గౌడ్


## అట్టహాసంగా తుంగభద్ర కొత్త క్రస్ట్ గేట్ల ప్రారంభోత్సవం

### చేతులు కలిపి ఐక్యత చాటిన సీఎంలు



2 లో

## హైకోర్టులో ప్రైవేట్ కాలేజ్ యాజమాన్యాలకు స్వల్ప ఊరట

**న్యూస్ డెస్క్, 25 జూన్ (ఇది కద నిజం):** తెలంగాణలోని ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాలకు రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం (హైకోర్టు)లో స్వల్ప ఊరట లభించింది. విద్యార్థుల నుండి ఫీజులు వసూలు చేయవద్దంటూ ప్రభుత్వం తీసుకొచ్చిన 'జీవో నంబర్ 9 లోని కొన్ని మార్గదర్శకాలపై హైకోర్టు స్టే విధించింది. ఈ వివాదంపై విచారణ చేపట్టిన న్యాయస్థానం.. వచ్చే మంగళవారం వరకు స్టే విధిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.

ప్రభుత్వాన్ని ప్రశ్నించిన హైకోర్టు

విచారణ సందర్భంగా ఫీజ్ రీఇంబర్స్‌మెంట్ బకాయిల చెల్లింపులపై హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని తీవ్రంగా ప్రశ్నించింది. "మీరు కాలేజీలకు ఇవ్వాల్సిన బకాయిలను చెల్లించరు.. అటు విద్యార్థుల నుండి ఫీజులు వసూలు చేయవద్దని కాలేజీలను ఆదేశిస్తే, ఇక వారు విద్యాసంస్థలను ఎలా నడుపుతారు?" అని కోర్టు నిలదీసింది. ఫీజ్ రీఇంబర్స్‌మెంట్ కోసం బడ్జెట్‌లో ఎంత మొత్తాన్ని కేటాయించారో చెప్పాలని ఆదేశించింది. బడ్జెట్ సమావేశాలు ముగిసినా బకాయిలను ఎందుకు విడుదల చేయలేదని, పెండింగ్ నిధులను ఎప్పటిలోగా చెల్లిస్తారో స్పష్టం చేయాలని ప్రభుత్వాన్ని కోరింది.




2 లో

# డబుల్ ఓట్ల తొలగింపు కొత్త ఓటర్లకు అవకాశం



- ఇంటింటికీ బీఎల్వోల సర్వే
- అక్టోబర్ 1న తుది జాబితా
- ఒక్కరికి ఒకే ఓటు
- తప్పుడు వివరాలకు కేసులు
- కొత్త ఓటర్లకు అవకాశం
- సర్ ప్రక్రియకు శ్రీకారం
- ఓటరు జాబితా ప్రక్షాళన
- జూలై 31న ముసాయిదా జాబితా
- ఎన్నికల సంఘం కసరత్తు
- రెండు చోట్ల ఓటుకు చెక్
- ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ
- ఓటర్ల ధృవీకరణ ముమ్మరం
- నకిలీ ఓట్లపై నిఘా
- రాష్ట్రవ్యాప్తంగా ఓటర్ల సర్వే

**న్యూస్ డెస్క్, 25 జూన్ (ఇది కద నిజం):** రాష్ట్రంలో ఓటరు జాబితా సవరణకు రంగం సిద్ధమైంది. డబుల్ ఓటర్లను తొలగించనున్నారు. గురువారం నుంచి ప్రారంభమయ్యే ప్రక్రియ అక్టోబర్ 1న తుది ఓటరు జాబితా ప్రచురణతో ముగియనుంది. రాష్ట్రంలో ప్రస్తుతం 3.38కోట్ల మంది ఓటర్లు ఉండగా, తుది ఓటర్ల జాబితాలో ఎంత మంది ఓటర్లు ఉంటారనే దానిపై ఆసక్తి నెలకొంది. ఎన్యుమరేషన్ ఫారాలను ముద్రించి ఇప్పటికే జిల్లాలకు పంపించారు. సర్ పై ఇప్పటికే రాజకీయ పార్టీలు పెద్దఎత్తున కసరత్తు చేస్తున్నాయి. బిహార్, పశ్చిమబెంగాల్లో ఎదురైన అనుభవాలతో పార్టీలన్నీ అప్రమత్తమయ్యాయి. ఈనెల 25వ తేదీ నుంచి ఇంటింటికీ తిరుగుతూ బీఎల్వోలు ఎన్యుమరేషన్ ఫారాలు అందిస్తారు.

ఇవి గుర్తుంచుకోండి..

కొందరు ఓటర్లు ఉద్యోగం, వ్యాపారం, ఇతరత్రా అవసరాల రీత్యా ఇతర ప్రాంతాల్లో నివాసం ఉంటారు. ఇలాంటప్పుడు వారి కుటుంబసభ్యులు సైతం ఆ ఎన్యుమరేషన్ ఫారాలను పూర్తిచేసి ఇవ్వచ్చు. రాష్ట్రం నుంచి ఎక్కువగా గల్ఫ్ దేశాలకు ఉపాధి కోసం వెళ్లారు. అదే సమయంలో మహారాష్ట్ర, గుజరాత్, హైదరాబాద్ నగరాలకు వలసలు వెళ్లారు.

మిగతాది 2 లో..

## నేటి నుంచే రొట్టెల పంపిణీ

### స్వర్ణాల చెరువు వద్ద భారీ ఏర్పాటు




2 లో

**న్యూస్ డెస్క్, 25 జూన్ (ఇది కద నిజం):** ఆంధ్రప్రదేశ్‌లోనే కాకుండా దేశవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన నెల్లూరు బారాషహీద్ దర్గా రొట్టెల పండుగకు సర్వం సిద్ధమైంది. శుక్రవారం నుంచి ఈ చారిత్రాత్మక వార్షిక మహోత్సవం అత్యంత వైభవంగా ప్రారంభం కానుంది. కులమతాలకు అతీతంగా సాగే ఈ సౌభ్రాతృత్వ వేడుకల కోసం ఇప్పటికే తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలోని పలు ప్రాంతాల నుంచి వేలాది సంఖ్యలో భక్తులు నెల్లూరు నగరానికి తరలివస్తున్నారు.

## 9వ తరగతి పుస్తకాల్లో 'ఎమర్జెన్సీ' పాఠం


### ఎన్‌సీఈఆర్‌టీ నిర్ణయాన్ని సమర్థించిన బీజేపీ




2 లో

## వెనెజువెలాలో భూకంపం

### కొన్ని క్షణాల ముందు ఫోన్లకు 'గూగుల్ అలర్ట్'




2 లో

**న్యూస్ డెస్క్, 25 జూన్ (ఇది కద నిజం):** వెనెజువెలా దేశాన్ని ఒకేసారి రెండు శక్తివంతమైన భూకంపాలు అల్లాడించాయి. రిక్టర్ స్కేలుపై భూకంప తీవ్రతలు 7.1, 7.5గా నమోదయ్యాయి. భూప్రకంపనల ధాటికి భారీ భవనాలు ఒక్కసారిగా పేకమేడల కూలిపోయాయి. గత శతాబ్ద కాలంలో సంభవించిన అత్యంత ఘోరమైన భూకంపాలు తమ దేశంలో ఇవేనని అక్కడి నిపుణులు చెబుతున్నారు. అయితే, ఈ విపత్తు వేళ మరో ఇంట్రెస్టింగ్ విషయం వెలుగులోకి వచ్చింది.

## తెలంగాణకు భారీ వర్ష సూచన

### ఈ జిల్లాలకు హెచ్చరికలు జారీ

**న్యూస్ డెస్క్, 25 జూన్ (ఇది కద నిజం):** తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ఎండల తీవ్రత నుంచి ఎట్టకేలకు ఉపశమనం లభించింది. గత కొన్ని వారాలుగా భానుడి భగభగలతో, తీవ్రమైన వడగాల్పులతో అల్లాడిపోయిన జనం.. ప్రస్తుతం వాతావరణంలో వచ్చిన మార్పులతో ఊపిరి పీల్చుకుంటున్నారు. రాష్ట్రవ్యాప్తంగా రెండు రోజుల కిందటి వరకు ఎండలు దంచి కొట్టాయి. చాలా ప్రాంతాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 43 డిగ్రీల సెల్సియస్‌ను దాటి నమోదు కావడంతో ప్రజలు ఇండ్ల నుండి బయటకు రావడానికే భయపడ్డారు. అయితే, వాతావరణంలో అకస్మాత్తుగా సంభవించిన మార్పుల కారణంగా ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా తగ్గుముఖం పట్టాయి. ప్రస్తుతం రాష్ట్రంలోని మెజారిటీ ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 34 డిగ్రీల నుంచి 39 డిగ్రీల



2 లో

సెల్సియస్ మధ్య నమోదవుతుండటం గమనార్హం.

హైదరాబాద్ వాతావరణ కేంద్రం అందించిన తాజా సమాచారం ప్రకారం.. రాష్ట్రంలో ఎండ తీవ్రత మరింత తగ్గే అవకాశం ఉంది. రాగల మూడు రోజుల్లో ఉష్ణోగ్రతలు మరో 2 నుంచి 5 డిగ్రీల వరకు తగ్గే సూచనలు కనిపిస్తున్నాయి.

## తెలంగాణలో స్పీడ్ పెంచిన జనసేన




2 లో

# నేటి నుంచే రొట్టెల పంపిణీ.. స్వర్ణాల చెరువు వద్ద భారీ ఏర్పాట్లు

మొదటి పేజీ తరువాయి



భక్తులు తమ కోర్కెలు నెరవేరాలని కోరుకుంటూ, నెరవేరిన వారు కృతజ్ఞతగా రొట్టెలను మార్చుకునే ఈ అద్భుత ఘట్టం కోసం స్వర్ణాల చెరువు (నెల్లూరు ట్యాంక్) ముస్తాబైంది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా బారాషహీద్ దర్గా ప్రాంగణంలో, స్వర్ణాల చెరువు ఘాట్ల వద్ద జిల్లా అధికార యంత్రాంగం పెద్ద ఎత్తున ఏర్పాట్లు పూర్తి చేసింది. తాగునీరు, నిరంతర విద్యుత్ సరఫరా, పారిశుధ్యం, ప్రత్యేక వైద్య శిబిరాలను అందుబాటులో ఉంచారు.

15 నుంచి 20 లక్షల మంది వస్తారని అంచనా..

గత ఏడాది కంటే ఈసారి భక్తుల రద్దీ మరింత ఎక్కువగా ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. ఈ ఐదు రోజుల పండుగ కాలంలో సుమారు 15 నుంచి 20 లక్షల మంది భక్తులు దర్గాను దర్శించుకుని, రొట్టెలను మార్చుకుంటారని అంచనా వేస్తున్నారు. అందుకు తగ్గేట్టుగానే ఘాట్ల సంఖ్యను పెంచి, క్యూలైన్లను క్రమబద్ధీకరించారు. లక్షలాదిగా తరలివచ్చే భక్తుల భద్రత దృష్ట్యా పోలీస్ శాఖ కట్టుదిట్టమైన బందోబస్తును ఏర్పాటు చేసింది. శాంతిభద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ నియంత్రణపై ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తున్నారు. దర్గా పరిసర ప్రాంతాలు, పార్కింగ్ జోన్లు, రొట్టెలు మార్చుకునే ఘాట్ల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా" వందలాది సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. వీటితో పాటు డ్రోన్ కెమెరాల ద్వారా యావత్ ప్రాంతాన్ని నిరంతరం పర్యవేక్షిస్తూ గట్టి నిఘా ఉంచారు. భక్తులకు సేవలందించేందుకు ప్రత్యేక కంట్రోల్ రూమ్‌లను కూడా అందుబాటులోకి తెచ్చారు.

# 9వ తరగతి పుస్తకాల్లో 'ఎమర్జెన్సీ' పాఠం.. ఎన్‌సీఈఆర్‌టీ నిర్ణయాన్ని సమర్థించిన బీజేపీ




**న్యూస్ డెస్క్, 25 జూన్ (ఇది కద నిజం):** నాటి ప్రధాని ఇందిరాగాంధీ దేశంలో విధించిన 'ఎమర్జెన్సీ'కి సంబంధించిన ప్రత్యేక అధ్యాయాన్ని 9వ తరగతి పాఠ్యపుస్తకంలో చేర్చాలన్న ఎన్‌సీఈఆర్‌టీ నిర్ణయాన్ని బీజేపీ పూర్తిగా సమర్థించింది. ఇందిరా ప్రధానిగా ఉన్న కాలంలో చీకటి రోజులు, ప్రజాస్వామ్య అణచివేతను నేటి తరం విద్యార్థులు తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని బీజేపీ స్పష్టం చేసింది. ఎన్‌సీఈఆర్టీ నిర్ణయంపై ఆ పార్టీ జాతీయ ప్రతినిధులు స్పందిస్తూ.. దేశ చరిత్రలో అత్యంత ప్రాధాన్యత కలిగిన, అదే సమయంలో రాజ్యాంగ విలువలను కాలరాసిన ఎమర్జెన్సీ కాలం గురించి పాఠ్యాంశాల్లో చేర్చడం రాజకీయ చర్య కాదన్నారు. అది చారిత్రక సత్యాన్ని విద్యార్థులకు అందించడమేనని పేర్కొన్నారు. యువతకు దేశ ప్రజాస్వామ్య రక్షణ పట్ల అవగాహన కల్పించడానికి ఎమర్జెన్సీ పాఠం ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు.

అయితే,ఎన్‌సీఈఆర్‌టీ నిర్ణయంపై విపక్షాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. రాబోయే తరాల్లో కాంగ్రెస్ పార్టీ పట్ల ప్రతికూలతను, విద్వేషాన్ని పెంచేందుకే కేంద్ర ప్రభుత్వ ఒత్తిడితో పాఠ్య పుస్తకాల్లో ఇలా మార్పులు చేశారని ఆరోపించారు. విద్యా వ్యవస్థను సైతం రాజకీయాలకు వాడుకుంటున్నారంటూ విమర్శలు గుప్పించారు. 1975 జూన్ 25న ఎమర్జెన్సీ విధించి 51 ఏళ్లు పూర్తి కావస్తున్న తరుణంలో ఎన్‌సీఈఆర్‌టీ తీసుకున్న నిర్ణయం ప్రస్తుతం దేశంలో చర్చనీయాంశంగా మారింది.

# అట్టహాసంగా తుంగభద్ర కొత్త క్రస్ట్ గేట్ల ప్రారంభోత్సవం చేతులు కలిపి ఐక్యత చాటిన సీఎంలు



**న్యూస్ డెస్క్, 25 జూన్ (ఇది కద నిజం):** కర్ణాటకలోని హోస్పేట్ వద్ద ఉన్న తుంగభద్ర డ్యామ్ 33 కొత్త క్రస్ట్ గేట్ల ప్రారంభోత్సవం అట్టహాసంగా జరిగింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు, కర్ణాటక సీఎం డీకే శివకుమార్‌తో పాటు కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ హాజరయ్యారు. ముందుగా వారంతా హోస్పేట్‌లోని ఐఆర్‌బీ గెస్ట్‌హౌస్‌లో మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. అనంతరం తుంగభద్ర డ్యామ్ సైట్‌కు వెళ్లి ముగ్గురు ముఖ్యమంత్రులతో సహా కేంద్ర మంత్రి వరుసగా 17, 18, 19, 20వ క్రస్ట్ గేట్లను ప్రారంభించారు. ఆ తర్వాత అక్కడే జ్ఞాపికగా శిలాఫలాకాన్ని సైతం ఆవిష్కరించారు. చివరగా సీఎం డీకే శివకుమార్, రేవంత్ రెడ్డి, చంద్రబాబు, కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ చేతులు కలిపి ప్రజలకు అభివాదం చేసి గ్రూప్ ఫొటో దిగారు.

# తెలంగాణలో స్పీడ్ పెంచిన జనసేన.. పార్టీ పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి సమావేశాల షెడ్యూల్ విడుదల!

**న్యూస్ డెస్క్, 25 జూన్ (ఇది కద నిజం):** ఏపీ, తెలంగాణ వివాదాల నేపథ్యంలో జనసేన పార్టీ తెలంగాణ రాష్ట్రంలో స్పీడ్ పెంచింది. జనసేన పార్టీని సంస్థాగత నిర్మాణాన్ని మరింత పటిష్టం చేయడం, ప్రజల సమస్యలపై పార్టీ భవిష్యత్ కార్యాచరణను బలోపేతం చేయడమే లక్ష్యంగా కీలక నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా జూన్ 28 నుంచి జూలై 7, 2026 వరకు రాష్ట్రవ్యాప్తంగా పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి సమీక్షా సమావేశాలను నిర్వహించనున్నారు. ప్రతిరోజూ రెండు విడతలుగా (ఉదయం 10:30 గంటలకు – సాయంత్రం 3:00 గంటలకు) ఈ సమావేశాలు జరగనున్నాయి. జూన్ 28న సికింద్రాబాద్, మల్కాజ్‌గిరి ప్రాంతాలతో ప్రారంభమై.. జూలై 7న నిజామాబాద్, భువనగిరి నియోజకవర్గాల సమావేశాలతో ఈ షెడ్యూల్ ముగియనుంది.

ఈ పది రోజుల పాటు జరిగే విస్తృత స్థాయి సమావేశాలలో వరంగల్, ఖమ్మం, నల్గొండ, హైదరాబాద్, మెదక్, కరీంనగర్, మహబూబ్‌నగర్ సహా అన్ని ప్రధాన పార్లమెంట్ స్థానాల పరిధిలోని స్థితిగతులపై పార్టీ అధిష్టానం సమీక్షించనుంది. పార్టీ నాయకులు, జనసైనికులు, వీరమహిళలు అందరూ పరస్పర సమన్వయంతో ఈ సమావేశాలలో పాల్గొని విజయవంతం చేయాలని జనసేన పార్టీ పిలుపునిచ్చింది. స్థానిక ప్రజా సమస్యలపై క్షేత్రస్థాయిలో పోరాడేందుకు, పార్టీ శ్రేణుల్లో నూతనోత్తేజాన్ని నింపేందుకు ఈ సమావేశాలు దిశానిర్దేశం చేస్తాయని పార్టీ శ్రేణులు, రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి.




# వెనెజువెలాలో భూకంపం..

## కొన్ని క్షణాల ముందు ఫోన్లకు 'గూగుల్ అలర్ట్'

మొదటి పేజీ తరువాయి




భూ ప్రకంపనలు భూమి పైభాగానికి తగలడానికి కొన్ని సెకన్ల ముందే తమ ఆండ్రాయిడ్ స్మార్ట్‌ఫోన్‌లకు గూగుల్ నుంచి భూకంప హెచ్చరిక వచ్చిందని పలువురు వినియోగదారులు సోషల్ మీడియా వేదికగా తమ స్క్రీన్‌షాట్‌లను షేర్ చేశారు.

'గూగుల్'కు ముందే ఎలా తెలిసిందంటే..

భూకంపం రాకముందే గూగుల్ ఎలా పసిగట్టగలిగిందనే ప్రశ్న ప్రస్తుతం అందరిలోనూ ఆసక్తిని రేపుతోంది. మనం వాడే స్మార్ట్‌ఫోన్లలో అక్సెలెరోమీటర్ సెన్సార్ ఉంటుంది. ఇది స్క్రీన్‌ను ఆటోమేటిక్‌గా రొటేట్ చేయడానికి యూజ్ అవుతుంది. అదేవిధంగా భూమిలో వచ్చే సూక్ష్మమైన వైబ్రేషన్లకు కూడా గుర్తించగలదు. ప్రపంచంలో ఎక్కడ భూమి కంపించినా, ఆ ప్రాంతంలోని ఆండ్రాయిడ్ ఫోన్లలోని అక్సెలెరోమీటర్ సెన్సార్లు ఆ వైబ్రేషన్‌ను గుర్తించి, వెంటనే ఆ సమాచారాన్ని గూగుల్ ఆండ్రాయిడ్ ఎర్త్‌క్వేక్ అలర్ట్స్ సిస్టమ్ సర్వర్‌కు వెళ్లగానే అక్కడి నుంచి ఆటోమెటిక్‌గా యూజర్‌కు 'ఎర్త్‌క్వేక్ అలర్ట్' వెళ్తుంది.

# "డబుల్ ఓట్ల తొలగింపు కొత్త ఓటర్లకు అవకాశం"

మొదటి పేజీ తరువాయి



ఎన్యుమరేషన్ ఫామ్స్ తీసుకునే సమయంలో ఎలాంటి పత్రాలు ఇవ్వాల్సిన పనిలేదని పేర్కొంటున్నారు. కేవలం ఎన్యుమరేషన్ ఫారం తిరిగి ఇస్తే సరిపోతుందని అంటున్నారు. అదే సమయంలో ఎన్యుమరేషన్ ఫామ్స్ రెండు ఇస్తారని, ఒక దానిని బీఎల్ వో సంతకం తీసుకుని వద్ద పెట్టుకోవాలని సూచిస్తున్నారు. పేర్లలో పొరపాట్లు, తప్పులు, నాటి పేరు నేటి పేరుకు సరిపోలకపోవడం తదితర వాటిని జులై 31 నుంచి ప్రారంభమయ్యే నోటీసులో చేపడతారు. నాటి పేరుకు ఇప్పటి పేరుకు ఎందుకు తేడా ఉంది, వయస్సులో తేడాలు వంటి వాటికి సంబంధించిన డాక్యుమెంట్లను చూపిస్తే సరిపోతుంది. ఇలాంటి వాటి కారణాలతో ఓట్లను తొలగించబోమని ఎన్నికల అధికారులు పేర్కొంటున్నారు.

ఒక్కరికి ఒకే ఓటు..

ప్రస్తుత సాఫ్ట్‌వేర్ ప్రకారం ఒకే వ్యక్తికి రెండు రాష్ట్రాల్లో ఓటు హక్కు ఉంటే గుర్తించే వ్యవస్థ లేదని చెబుతున్నారు. ఒకే రాష్ట్రంలో వేర్వేరు జిల్లాల్లో ఉంటే వారిని గుర్తిస్తుందని, ఇలా ఇప్పటి వరకు ఐదు లక్షల మంది వరకు గుర్తించినట్లు వారి నుంచి ఆప్షన్ తీసుకుని ఎక్కడ ఓటు ఉంచుకుంటారో తెలుసుకుని ఒక ఓటును మాత్రమే ఉంచి మిగిలిన వాటిని తొలగించారు. దీంతో హైదరాబాద్ లో ఉపాధి, ఉద్యోగ, వ్యాపార అవకాశాల కోసం లక్షల సంఖ్యలో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి ఇక్కడ నివాసం ఉంటున్నారు. వారిలో అత్యధికులకు అక్కడ, ఇక్కడ ఓటు హక్కు ఉంది. దీంతో వారిని రెండుచోట్లా ఉన్నట్టు గుర్తించే వ్యవస్థ లేకపోవడంతో వారు రెండు రాష్ట్రాల్లో కొనసాగే అవకాశాలు ఉన్నాయని చెబుతున్నారు.

తప్పుడు సమాచారమిస్తే కేసులు

'సర్' ప్రక్రియలో తప్పుడు సమాచారం ఇచ్చే ఓటర్లపై కేసులు పెట్టేందుకు ఎన్నికల సంఘం సన్నద్ధమవుతుంది. ఒకేవ్యక్తి రెండు చోట్ల ఎస్ఐఆర్ ఎన్యుమరేషన్ ఫారాలు ఇస్తే వారిపై చర్యలు తీసుకోనున్నారు. పశ్చిమబెంగాల్ రాష్ట్రంలో 375 మంది ఒకే వ్యక్తిని మ్యాపింగ్ చేశారని, మరో రాష్ట్రంలో 250 మంది మ్యాపింగ్ చేశారని, ఇలా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. ఇలాంటి తప్పుడు సమాచారాన్ని ఇచ్చే వారిని అడ్డకట్ట వేయాలంటే కొందరిపై కేసులు పెడితే మిగిలిన వారిలో కొంత భయం వస్తుందని భావిస్తున్నారు.

కొత్త ఓట్లకు అవకాశం

ప్రస్తుతం జరిగే 'సర్' ప్రక్రియలో కొత్త ఓటర్లు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించారు. వీరు బీఎల్ వో ఇంటికి వచ్చినప్పుడు దరఖాస్తు ఫారాన్ని పూర్తిచేసి దానికి అవసరమైన డాక్యుమెంట్లు అందించాల్సి ఉంటుంది. వారి పేర్లను తుది ఓటరు జాబితాలో చేర్చుతారు. ఇతర ప్రాంతాల్లోఉండే వారికి ఆన్‌లైన్‌లో www.eci.gov.in లో ఎన్‌రోల్‌మెంట్ ఫారాన్ని పూర్తిచేసే సదుపాయం కల్పించారు. అయితే ఆధార్ ఓటీపీ ఆధారంగా పూర్తిచేయొచ్చు. ఓటరు జాబితాలో పేరు, ఆధార్ పేరుకు తేడా ఉంటే సాధ్యం కాదని అధికారులు పేర్కొంటున్నారు.

ఎస్ఐఆర్ షెడ్యూల్ ఇలా..

ఇంటింటికి ఎన్యుమరేషన్ ఫామ్స్ పంపిణీ : జూన్ 25 నుంచి జులై 24
ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకటన : జూలై 31
అభ్యంతరాల స్వీకరణ : జులై 31 నుంచి ఆగస్టు 30
నోటీసులు ఇచ్చే టైం : జులై 31 నుంచి సెప్టెంబర్ 28
తుది ఓటరు జాబితా ప్రచురణ : అక్టోబర్ 1

# 'సీఎం సువేందు బాబును ఆపండి" భారత్‌కు బంగ్లాదేశ్ ఎంపీ విజ్ఞప్తి



**న్యూస్ డెస్క్, 25 జూన్ (ఇది కద నిజం):** పశ్చిమ బెంగాల్ సీఎం సువేందు అధికారి నిర్ణయాలు, వ్యాఖ్యలు బంగ్లాదేశ్‌కు నిద్ర పట్టకుండా చేస్తున్నాయి. ఇన్నాళ్లు అత్తగారి ఇంటిలా బంగ్లాదేశ్ నుంచి బెంగాల్‌కు వలసలు సాగేవి. బీజేపీ ప్రభుత్వ రాకతో అక్రమ చొరబాటుదారులు సొంత దేశానికి పారిపోతున్నారు. ఇదే కాకుండా, బంగ్లాదేశీయుల్ని హెచ్చరిస్తూ సీఎం సువేందు అధికారి కీలక వ్యాఖ్యలు చేస్తున్నారు. ఈ పరిణామాలన్నింటిపై బంగ్లాదేశ్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

భారత్-బంగ్లాదేశ్ సంబంధాలపై బంగ్లా పార్లమెంట్‌లో కీలక చర్చ జరిగింది. అధికార బీఎన్పీ ఎంపీ గులాం మహమ్మద్ సిరాజ్ మాట్లాడుతూ.. బెంగాల్ సీఎం సువేందు అధికారి చేస్తున్న వ్యాఖ్యలపై ఆందోళన వ్యక్తం చేశారు. ఆయనను కట్టడి చేయాలని భారత ప్రభుత్వాన్ని కోరారు. సీఎం సువేందు తరుచుగా బంగ్లాదేశ్‌కు వ్యతిరేకంగా మాట్లాడుతున్నారని, ఆయన చేస్తున్న ప్రకటనలు రెండు దేశాల మధ్య సంబంధాలను దెబ్బతీసే అవకాశం ఉందని అన్నారు. " నేను స్పీకర్ ద్వారా భారత ప్రభుత్వానికి చెప్పాల్సింది ఒకటే. పశ్చిమ బెంగాల్ నాయకుడు సువేందు బాబును అడ్డుకోవాలి. ఆయన చేస్తున్న వ్యాఖ్యలు భారత్-బంగ్లా స్నేహానికి అనుకూలంగా లేవు" అని అన్నారు.

మాజీ ప్రధాని షేక్ హసీనా ప్రస్తుతం బంగ్లాదేశ్ రాజకీయాల్లో అంశం కాదని, ఆమెకు ప్రస్తుత పరిణామాలతో ఎలాంటి సంబంధం లేదని చెప్పారు. షేక్ హసీనా ముగిసిన అధ్యాయం అని అన్నారు. ఆమె గురించి తమకు ఎలాంటి ఆందోళన లేదని ఎంపీ చెప్పారు. రెండు దేశాల మధ్య సంబంధాల్ని బలోపేతం చేయాలని సూచించారు. ఇద్దరు స్నేహితులు, భార్యభర్తలు విడిపోవచ్చు, కానీ ఇరుగుపొరుగు మధ్య ఉన్న సంబంధాలకు విడాకులు ఉండవని, బంగ్లాదేశ్-భారత్ ఎప్పటికీ పొరుగుదేశాలుగానే ఉంటాయని అన్నారు.

# తెలంగాణకు భారీ వర్ష సూచన ఈ జిల్లాలకు హెచ్చరికలు జారీ

మొదటి పేజీ తరువాయి



ఇదే సమయంలో రాష్ట్రవ్యాప్తంగా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ అధికారులు వెల్లడించారు. కేవలం సాధారణ వర్షాలే కాకుండా.. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కూడా అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని హెచ్చరించారు. ఈ వర్షాల సమయంలో గంటకు 30 నుండి 40 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే ప్రమాదం ఉందని, ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ కేంద్రం సూచించింది.

వాతావరణ శాఖ హెచ్చరికల ప్రకారం రాష్ట్రంలోని మెజారిటీ జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉంది. ముఖ్యంగా ఆదిలాబాద్, కొమరం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, మరియు కామారెడ్డి జిల్లాలలో అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందని స్పష్టం చేశారు.

రాష్ట్రంలో ఇప్పటికే పలు ప్రాంతాల్లో వానలు దంచికొడుతున్నాయి. గడిచిన 24 గంటల్లో గణనీయమైన స్థాయిలో వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. కొమరం భీం అసిఫాబాద్ జిల్లా జైనూరులో అత్యధికంగా 7 సెంటీమీటర్ల వర్షం కురవగా.. పెద్దపల్లి జిల్లా సారంగపూర్‌లో కూడా అదే స్థాయిలో 7 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. అలాగే.. ములుగు జిల్లా గోవిందరావుపేటలో 5 సెంటీమీటర్లు, నిర్మల్ జిల్లాలోని నర్సాపూర్‌లో 5.1 సెంటీమీటర్ల వర్షం పడింది. నిర్మల్ జిల్లాలోని ఇతర ప్రాంతాలైన లోకేశ్వరంలో 4.4 సెంటీమీటర్లు, సారంగపూర్‌లో 4.4 సెంటీమీటర్లు, భైంసాలో 4.3 సెంటీమీటర్లు, నిర్మల్ టౌన్‌లో 3.6 సెంటీమీటర్ల చొప్పున వర్షపాతం రికార్డయింది. వరంగల్ జిల్లా నల్లబెల్లిలో కూడా 4 సెంటీమీటర్ల మేర వర్షం కురిసి వాతావరణాన్ని చల్లబరిచింది.

హైదరాబాద్, పరిసర ప్రాంతాల్లో కూడా వాతావరణం పూర్తిగా ఆహ్లాదకరంగా మారింది. ఐటీ కారిడార్‌తో పాటు నగరంలోని పలు ప్రాంతాల్లో ఆకాశం మేఘావృతమై ఉండి.. చల్లటి గాలులు వీస్తున్నాయి. జీహెచ్ఎంసీ పరిధిలో నిన్నటి నుంచి పలుచోట్ల మోస్తరు వర్షాలు కురిశాయి. రంగారెడ్డి జిల్లా బాలాపూర్‌లో 2.6 సెంటీమీటర్లు, అబ్దుల్లాపూర్‌మెట్‌లో 1.6 సెంటీమీటర్లు, హయత్‌నగర్‌లో 1.5 సెంటీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.

# హైకోర్టులో ప్రైవేట్ కాలేజ్ యాజమాన్యాలకు స్వల్ప ఊరట

మొదటి పేజీ తరువాయి

ఆగస్ట్ 15 లోపు క్లియర్ చేస్తాం: ప్రభుత్వ న్యాయవాది




హైకోర్టు ప్రశ్నలకు ప్రభుత్వ తరఫు న్యాయవాది స్పందిస్తూ.. రాబోయే ఆగస్ట్ 15 లోపు ఫీజ్ రీఇంబర్స్‌మెంట్‌కు సంబంధించిన బకాయిలన్నీ క్లియర్ చేస్తామని కోర్టుకు వివరించారు. దీనిపై ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాలు స్పందిస్తూ.. ప్రభుత్వం అన్నట్లుగా ఆగస్ట్ 15 లోపు బకాయిలన్నీ పూర్తిగా చెల్లిస్తే, తాము దాఖలు చేసిన పిటిషన్లన్నింటినీ అదే రోజున వెనక్కి (విత్ డ్రా) తీసుకుంటామని న్యాయస్థానానికి తెలిపారు.

నలిగిపోతున్న విద్యార్థులు.. కోర్టును ఆశ్రయించిన బాధితులు

ఈ వివాదంలో తాము కూడా భాగస్వామ్యులవుతామంటూ (ఇంప్లీడ్) పలువురు విద్యార్థులు కోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. విద్యార్థుల తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. అటు ప్రభుత్వం, ఇటు కాలేజీ యాజమాన్యాల మధ్య అసలు తప్పు లేని విద్యార్థులు నలిగిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇచ్చే బకాయిల ఆలస్యం కారణంగా ప్రస్తుతం 2, 3, 4వ సంవత్సరాలు చదువుతున్న విద్యార్థులు నష్టపోకుండా చూడాలని కోరారు. అలాగే ప్రభుత్వ నిబంధనలు లేదా ఉత్తర్వులు ఏవైనా ఉంటే, అవి ఈ ఏడాది కొత్తగా జాయిన్ అయ్యే విద్యార్థులకే వర్తించేలా చూడాలని న్యాయస్థానాన్ని అభ్యర్థించారు. ఈ కేసులో తదుపరి వాదనలను మంగళవారం అడ్వకేట్ జనరల్ స్వయంగా వినిపిస్తారని ప్రభుత్వ న్యాయవాది కోర్టుకు తెలపడంతో, హైకోర్టు తదుపరి విచారణను వచ్చే మంగళవారానికి వాయిదా వేసింది.

# డిజిటల్ అరెస్టులపై పంజా

## తెలుగు రాష్ట్రాలు సహా 16 రాష్ట్రాల్లో సీబీఐ రెయిడ్స్




**న్యూస్ డెస్క్, 25 జూన్ (ఇది కద నిజం):** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న డిజిటల్ అరెస్టులపై సీబీఐ పంజా విసిరింది. ఈ స్కామ్‌ల నెట్‌వర్క్‌ను ఛేదించడానికి సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సిబిఐ) గురువారం భారీ ఆపరేషన్ చేపట్టింది. దేశవ్యాప్తంగా 16 రాష్ట్రాల్లోని 80 ప్రాంతాల్లో ఏకకాలంలో మెరుపు దాడులు నిర్వహించింది. సుప్రీంకోర్టు అధికారిక వెబ్‌సైట్ ను పోలిన ఒక నకిలీ వెబ్‌సైట్ ను గుర్తించిన నేపథ్యంలో ఈ సోదాలు కొనసాగుతున్నాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, పంజాబ్, గుజరాత్, ఢిల్లీ, మహారాష్ట్ర, హర్యానా, తమిళనాడు, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, అస్సాం, పశ్చిమ బెంగాల్, మణిపూర్, కర్ణాటక, ఒడిశా రాష్ట్రాల్లో ఈ తనిఖీలు కొనసాగుతున్నాయి.

రూ.2 కోట్ల లావాదేవీలు.. ఇద్దరి అరెస్ట్

200కు పైగా డిజిటల్ అరెస్ట్ కేసులతో సంబంధం ఉన్న ఒక పెద్ద నేరపూరిత నెట్‌వర్క్‌ను నిర్మూలించడమే లక్ష్యంగా ఈ దాడులు జరిగినట్లు సీబీఐ ప్రతినిధి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నకిలీ కంపెనీలను (షెల్ కంపెనీలు) సృష్టించి, సైబర్ నేరగాళ్లకు సహకరిస్తూ... మ్యూల్ బ్యాంక్ ఖాతాల (మనీ లాండరింగ్ కోసం వాడే ఇతరుల ఖాతాలు) ద్వారా దాదాపు రూ. 2 కోట్ల అక్రమ సొమ్మును దారి మళ్లించినందుకు గానూ చెన్నైకి చెందిన బి. నరేష్, కోల్‌కతాకు చెందిన సంజీబ్ సాహాలను సీబీఐ అధికారులు అరెస్ట్ చేశారు. ఈ తనిఖీల్లో భారీ ఎత్తున నేరానికి సంబంధించిన పత్రాలు, డిజిటల్ పరికరాలు, మొబైల్ ఫోన్లు, బ్యాంక్ లావాదేవీల రికార్డులను సీబీఐ స్వాధీనం చేసుకున్నారు. వీటిని మరింత లోతుగా విశ్లేషించేందుకు ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించారు. అయితే ఈ ముఠా కేవలం భారతీయులనే కాకుండా, పలు ఇతర దేశాల పౌరులను కూడా మోసం చేసినట్లు ఆధారాలు లభించడంతో.. సీబీఐ అంతర్జాతీయ ఛానెల్స్ ద్వారా ఆయా దేశాల దర్యాప్తు సంస్థలను కూడా అలర్ట్ చేసినట్లు సమాచారం.





# జనగామలో ఘనంగా 'మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం'

## నెహ్రూ పార్క్ నుండి చౌరస్తా వరకు భారీ ర్యాలీ

ఇది కద నిజం, జనగామ: ఉమెన్స్ డెవలప్మెంట్ సొసైటీ -- జిల్లా డీ-అడిక్షన్ సెంటర్ (DDAC) మరియు జనగామ జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ మరియు మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమం నెహ్రూ పార్క్ నుండి జంగాం మెయిన్ చౌరస్తా వరకు సాగింది. ర్యాలీలో విద్యార్థులు మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జనగామ డీసీపీ రాజమహేంద్ర నాయక్ మాట్లాడుతూ, యువత మాదకద్రవ్యాలకు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్ కొనుగోలు చేయడం, విక్రయించడం చట్టరీత్యా నేరమని తెలిపారు. ఎవరైనా డ్రగ్స్ విక్రయిస్తున్నట్లు తెలిసిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, ఇందుకోసం టోల్ ఫ్రీ నంబర్ 1908కు కాల్ చేయాలని కోరారు. జనగామ సీఐ సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ, యువత డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, వాటిని ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రోత్సహించకూడదని అన్నారు. డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం ఏదైనా ఉంటే పోలీసులకు తెలియజేయాలని కోరారు. జిల్లా న్యాయ సేవల సంస్థ (DLSA) ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కుమారి జి. శశి మాట్లాడుతూ, మత్తు పదార్థాలకు బానిసైన విద్యార్థులు లేదా ఇతర వ్యక్తుల గురించి సమాచారం ఉంటే సంబంధిత అధికారులకు తెలియజేయాలని సూచించారు. అటువంటి వారికి కౌన్సెలింగ్ కేంద్రాల ద్వారా సహాయం అందించడంతో పాటు, అవసరమైతే పునరావాస కేంద్రాలకు (Rehabilitation Centres) పంపించే చర్యలు తీసుకుంటామని తెలిపారు. యువత ఎట్టి పరిస్థితుల్లోనూ మత్తు పదార్థాలకు బానిసలు కాకూడదని హితవు పలికారు. ఉమెన్స్ డెవలప్మెంట్ సొసైటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ (PD) మాట్లాడుతూ, జంగాంలో గత మూడు సంవత్సరాలుగా జిల్లా డీ-అడిక్షన్ సెంటర్‌ను నిర్వహిస్తున్నామని తెలిపారు. మాదకద్రవ్యాలు లేదా ఇతర మత్తు పదార్థాలకు బానిసైన వ్యక్తులు ఎవరైనా ఉంటే వారిని డీ-అడిక్షన్ సెంటర్‌కు రిఫర్ చేయాలని కోరారు. కేంద్రంలో చికిత్స, కౌన్సెలింగ్ మరియు పునరావాస సేవలు అందిస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో ఉమెన్స్ డెవలప్మెంట్ సొసైటీ అధ్యక్షులు సిద్దేశ్వర్, ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ బి. బాలకృష్ణ, కౌన్సిలర్ ఊర్మిళ మేడమ్, సిబ్బంది షాను, తిరుపతి, జిల్లా పోలీసు శాఖ అధికారులు, జిల్లా న్యాయ సేవల సంస్థ (DLSA) ప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో అందరూ తమ వంతు సహకారం అందించారు.

# ఎరువుల ధరల పెంపును వెంటనే రద్దు చేయాలి

## తహశీల్దార్ కార్యాలయం ఎదుట రైతు సంఘం ధర్నా




ఇది కద నిజం న్యూస్ జఫర్గడ్, జూన్ 25

కేంద్ర ప్రభుత్వం పెంచిన ఎరువుల ధరలను వెంటనే రద్దు చేసి, పాత విధానంలోనే రైతులకు సబ్సిడీతో ఎరువులు అందించాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు జాఫర్గడ్ మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం ఎదుట రైతు సంఘం ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రైతు సంఘం మండల అధ్యక్షుడు ఎం.డి. యాకుబ్ పాషా, కార్యదర్శి పెండ్యాల సమ్మయ్య అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు జువ్వారి రమేష్ పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు వ్యతిరేక విధానాల కారణంగా ఎరువుల ధరలు గణనీయంగా పెరిగి రైతులపై తీవ్ర భారం పడుతోందన్నారు. రైతులను వ్యవసాయం నుంచి దూరం చేసే కుట్రలో భాగంగానే మోడీ ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆరోపించారు. సబ్సిడీలను ఎత్తివేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ముఖ్యంగా చిన్న, సన్నకారు రైతుల పరిస్థితి రోజురోజుకూ దయనీయంగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. "రైతే రాజు" అని చెప్పుకునే పాలకులు రైతుల సంక్షేమాన్ని విస్మరిస్తున్నారని విమర్శించారు. ఎరువుల ధరల పెంపును వెంటనే రద్దు చేసి, రైతులకు అందుబాటు ధరల్లో ఎరువులు, క్రిమిసంహారక మందులు అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం కొనసాగిస్తామని, ఎరువులు, పురుగుమందుల ధరల పెంపుపై రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి ఎం.డి. నూర్ నిస్సా, మంద బుచ్చయ్య, వేల్పుల పెద్దరాములు, బుల్లె దూడయ్య, బుల్లె సాయులు, ఎర్రం సతీష్ తదితర రైతులు పాల్గొన్నారు.

# మత్తు పదార్థాలకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవితాన్ని అలవర్చుకోండి!

## ఉమెన్స్ డెవలప్మెంట్ సొసైటీ, డీ-అడిక్షన్ సెంటర్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం






ఇది కద నిజం, జనగామ: ఉమెన్స్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలోని జిల్లా డీ-అడిక్షన్ సెంటర్ (ణణాజ) ద్వారా అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా "డ్రగ్ అబ్యూస్ ప్రివెన్షన్ అవేర్‌నెస్ వీక్" కార్యక్రమంలో భాగంగా జనగామలో కస్తూరిబాగాంధీ బాలికల విద్యాలయం చౌడారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చైల్డ్ డెవలప్మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ శ్రీమతి మన్నెమ్మ మాట్లాడుతూ యువత గంజాయి, మద్యం మరియు ఇతర మత్తు పదార్థాలకు బానిస కాకుండా తమ భవిష్యత్తుపై దృష్టి సారించాలని సూచించారు. ఎలాంటి చెడు అలవాట్లకు లోనుకాకుండా ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఉమెన్స్ డెవలప్మెంట్ సొసైటీ అధ్యక్షులు సిద్ధేశ్వర్ మాట్లాడుతూ డ్రగ్స్ మరియు మద్యం వినియోగం వల్ల కలిగే శారీరక, మానసిక ఆరోగ్య సమస్యల గురించి వివరించారు. అలాగే మత్తు పదార్థాలకు బానిసైన వారికి జిల్లా డీ-అడిక్షన్ సెంటర్ ద్వారా అందించే చికిత్స, కౌన్సెలింగ్ సేవలు మరియు పునరావాస కార్యక్రమాల గురించి అవగాహన కల్పించారు. ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ బాలకృష్ణ మాట్లాడుతూ డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు అందరూ దూరంగా ఉండి, మానసికంగా మరియు శారీరకంగా ఆరోగ్యవంతులై మంచి ప్రవర్తన కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ డెవలప్మెంట్ ప్రాజెక్ట్ సిబ్బంది, ఉమెన్స్ డెవలప్మెంట్ సొసైటీ ప్రాజెక్ట్ సిబ్బంది యాకుబ్ పాషా, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# కుత్బుల్లాపూర్‌లో విలువైన ప్రభుత్వ భూమికి రెవెన్యూ అధికారుల ఫెన్సింగ్

## ప్రభుత్వ స్థలాన్ని రక్షించిన అధికారులకు అభినందనలు తెలిపిన నల్ల జయశంకర్ గౌడ్




ఇది కద నిజం: కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని పెదబషీర్‌బాద్ గ్రామం, సర్వే నెం. 23లో ఉన్న విలువైన ప్రభుత్వ భూమిని రక్షించేందుకు రెవెన్యూ అధికారులు ఫెన్సింగ్ ఏర్పాటు చేసి, ప్రభుత్వ భూమి అని బోర్డు ఏర్పాటు చేయడంపై నల్ల జయశంకర్ గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సుమారు రూ.100 కోట్లకు పైగా విలువ చేసే ప్రభుత్వ భూమిని కాపాడేందుకు అధికారులు చర్యలు తీసుకోవడం స్వాగతించదగ్గ విషయమన్నారు. గత 15 నెలలుగా ఈ ప్రాంతంలోని ప్రభుత్వ భూముల పరిరక్షణ కోసం తాము నిరంతరం పోరాటం చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ స్థలాన్ని రక్షించాలని కోరుతూ వివిధ స్థాయిల్లో ఫిర్యాదులు చేసినట్లు పేర్కొన్నారు. మార్చి 2026లో కుత్బుల్లాపూర్ తహసీల్దార్ (ఎంఆర్వో) హైడ్రాకు లేఖ రాయడం, అలాగే ప్రభుత్వ భూమిలో రోడ్డు నిర్మాణ ప్రయత్నాలపై అదనపు కలెక్టర్‌కు ప్రజావాణి ద్వారా ఫిర్యాదు చేయడం జరిగిందని తెలిపారు. ఆ ఫిర్యాదుల నేపథ్యంలో కుత్బుల్లాపూర్ ఎంఆర్వో రాజేష్ ఆధ్వర్యంలో అధికారులు సర్వే నిర్వహించి ప్రభుత్వ భూమిని గుర్తించి, ఈరోజు ఫెన్సింగ్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు.

ఈ సందర్భంగా ఆకుల సతీష్ మాట్లాడుతూ, గత 15 నెలలుగా పలుమార్లు ఎంఆర్వో, కలెక్టర్ కార్యాలయాలకు ఫిర్యాదులు చేసిన నేపథ్యంలో రెవెన్యూ అధికారులు స్పందించి ప్రభుత్వ భూమిని గుర్తించి రక్షణ చర్యలు చేపట్టడం సంతోషకరమన్నారు.

అలాగే, స్వాధీనం చేసుకున్న ప్రభుత్వ భూమిలో అవసరమైన ప్రభుత్వ కార్యాలయాలను ఏర్పాటు చేయడంతో పాటు, మిగిలిన స్థలాన్ని ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అదేవిధంగా, కుత్బుల్లాపూర్ ప్రాంతంలో గతంలో ప్రభుత్వ భూముల ఆక్రమణలపై వచ్చిన ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బలరాం, ఎల్లస్వామి, ఈశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బైక్ చోరీ కేసు నిందితుడి ఆచూకీ కోసం పోలీసుల విజ్ఞప్తి




ఇది కద నిజం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా, పిట్లం, జూన్ 25: పిట్లం పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన బైక్ చోరీ కేసులో నిందితుడిగా అనుమానిస్తున్న వ్యక్తి ఆచూకీ కోసం పోలీసులు గాలింపు ప్రజల సహకారం కోరుతున్నారు. ఫొటోలో ఉన్న వ్యక్తి గురించి ఎవరికైనా సమాచారం తెలిసినట్లయితే వెంటనే పోలీసులకు తెలియజేయాలని పిట్లం ఎస్సై ఆంజనేయులు కోరారు. నిందితుడి ఆచూకీ తెలిపిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. సమాచారం అందించాల్సిన ఫోన్ నంబర్లు: పిట్లం ఎస్ఐ: 8712686171


బాన్సువాడ రూరల్ సీఐ: 8712686170 నంబర్లకు ఫోన్ చేసి తెలియజేయగలరని కోరారు.

# చిన్న కొడపగల్ గ్రామపంచాయతీ పాలకవర్గ సమావేశం



ఇది కద నిజం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా జూన్ 25: కామారెడ్డి జిల్లా పిట్లం మండలం చిన్న కొడపగల్ గ్రామపంచాయతీలో గురువారం సర్పంచ్ రెడ్డి కిరణ్ అధ్యక్షతన గ్రామపంచాయతీ పాలకవర్గ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించి తీర్మానాలు చేశారు. గ్రామంలోని కల్వర్టుల మరమ్మత్తులు చేపట్టడంతో పాటు అవసరమైన ప్రాంతాల్లో కొత్త కల్వర్టుల నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. అలాగే శిథిలావస్థకు చేరుకున్న 20 విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్త స్తంభాలను ఏర్పాటు చేయాలని తీర్మానించారు. గ్రామంలో పచ్చదనాన్ని పెంపొందించేందుకు రెడ్డి చెరువు వద్ద 1,500 మొక్కలు నాటాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి రాము పాల్గొన్నారు. గ్రామాభివృద్ధి పనులను ప్రణాళికాబద్ధంగా అమలు చేసి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామని సర్పంచ్ రెడ్డి కిరణ్ తెలిపారు.

# డ్రగ్స్ రహిత తెలంగాణ కోసం 2కే రన్ నిర్వహణ



ఇది కద నిజం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా పిట్లం, జూన్ 25: డ్రగ్స్ నిర్మూలనపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు పిట్లం మండల కేంద్రంలో శుక్రవారం (జూన్ 26) ఉదయం 6:30 గంటలకు 2కే రన్ నిర్వహించనున్నట్లు పిట్లం ఎస్సై ఆంజనే యులు తెలిపారు. కామారెడ్డి జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర ఐపీఎస్ ఆదేశాల మేరకు పిట్లం అంబేద్కర్ చౌరస్తా వద్ద ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. "డ్రగ్స్ రహిత తెలంగాణ మనందరి ధ్యేయం" అనే నినాదంతో చేపట్టనున్న ఈ రన్‌లో యువత, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, మండల ప్రజలు పార్టీలకు అతీతంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎస్సై ఆంజనేయులు కోరారు.

డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన పెంపొందించడం, సమాజాన్ని మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు.

# కరేగావ్, బుర్నాపూర్ గ్రామపంచాయతీల్లో ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులకు గడియారాల పంపిణీ






ఇది కద నిజం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా జూన్ 25: కామారెడ్డి జిల్లా పిట్లం మండలంలోని కరేగావ్, బుర్నాపూర్ గ్రామపంచాయతీల పరిధిలో ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులకు గడియారాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ఫలాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరుతున్నాయని తెలిపారు. ఇందిరమ్మ ఇల్లు పథకం లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ ప్రతినిధులు, గ్రామ పెద్దలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# గ్రీన్ ఫీల్డ్ రహదారిపై దగ్ధమైన కారు"



వేంసూరు,జూన్25,ఇది కద నిజం న్యూస్:

సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలోని వేంసూరు సమీపంలోని గ్రీన్ ఫీల్డ్ హైవేపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ కారు పూర్తిగా అగ్నికి ఆహుతైంది. అయితే కారులో ప్రయాణిస్తున్న ఏడుగురు యువకులు సమయస్ఫూర్తితో బయటకు రావడంతో పెను ప్రమాదం తప్పింది. పోలీసుల వివరాల ప్రకారం, హైదరాబాద్ నుంచి ఎర్రవరం వైపు కారులో ప్రయాణిస్తున్న ఏడుగురు యువకులు వేంసూరు సమీపానికి చేరుకోగానే కారు ముందు టైర్ అకస్మాత్తుగా పేలింది. దీంతో వాహనం అదుపు తప్పి రోడ్డుపక్కనున్న రక్షణ రైలింగ్‌ను బలంగా ఢీకొట్టింది. ప్రమాదం జరిగిన వెంటనే కారులో మంటలు చెలరేగాయి. పరిస్థితిని గుర్తించిన యువకులు వెంటనే వాహనం నుంచి బయటకు రావడంతో ప్రాణాలతో బయటపడ్డారు. ఈ ఘటనలో వారికి స్వల్ప గాయాలే కాగా, కారు పూర్తిగా అగ్నికి ఆహుతైంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. స్థానికులు, హైవే సిబ్బంది సహాయక చర్యలు చేపట్టగా, ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

# సినిమా న్యూస్



## అమరావతిలో అంగరంగ వైభవంగా
# ఎన్బీకే 112

నటసింహం నందమూరి బాలకృష్ణ, స్టార్ డైరెక్టర్ కొరటాల శివ కాంబినేషన్‌లో ఒక భారీ ప్రాజెక్ట్ పట్టాలెక్కింది. బాలయ్య కెరీర్‌లో 112వ చిత్రంగా రాబోతున్న ఈ క్రేజీ పొలిటికల్ డ్రామా పూజా కార్యక్రమాలతో అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి పరిధిలోని వెంకటాయపాలెంలో గల ప్రసిద్ధ టీటీడీ శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఈ ముహూర్తపు వేడుక నిర్వహించారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన ఈ పూజా కార్యక్రమానికి ఏపీ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తొలి క్లాప్ కొట్టగా అలాగే ఏపీ సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ కెమెరా స్విచ్ ఆన్ చేసారు. బాలయ్య చిన్న కుమార్తె తేజశ్విని, నిర్మాత దగ్గుబాటి సురేష్ బాబు, దర్శకులు గోపీచంద్ మలినేని ముఖ్య అతిథిధులుగా హాజరయ్యారు. ఎస్ఎల్‌వి సినిమాస్, యువసుధ ఆర్ట్స్ పతాకాలపై సుధాకర్ చెరుకూరి, సుధాకర్ మిక్కిలినేని ఈ చిత్రాన్ని అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు.

బాలకృష్ణ ఊరమాస్ ఇమేజ్‌కు, సామాజిక సందేశాలను కమర్షియల్ ఎలిమెంట్స్‌తో పవర్‌ఫుల్‌గా చూపించే కొరటాల శివ మార్క్ టేకింగ్ తోడవుతుండటంతో అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. గతంలో బాలకృష్ణ ఇండస్ట్రీ హిట్ చిత్రం 'సింహా' సినిమాకు కొరటాల శివ రచయితగా పనిచేశారు. ఆ సినిమాలో బాలయ్య డైలాగ్స్, క్యారెక్టరైజేషన్ ఎంతటి సంచలనం సృష్టించాయో అందరికీ తెలిసిందే. ఇప్పుడు మళ్లీ ఇన్నేళ్ల తర్వాత వీరిద్దరూ దర్శకుడు–నటుడిగా చేతులు కలపడం అభిమానుల్లో పూనకాలు తెప్పిస్తోంది. 'పవర్ మీట్స్ పర్పస్, మాస్ బికమ్స్ ఎ మూవ్‌మెంట్' అనే పవర్‌ఫుల్ ట్యాగ్‌లైన్‌తో రాబోతున్న ఈ పొలిటికల్ యాక్షన్ ఎంటర్‌టైనర్, బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డులను సృష్టించడం ఖాయమని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ సినిమాకు సంబంధించిన మరిన్ని నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను మేకర్స్ త్వరలోనే అధికారికంగా ప్రకటించనున్నారు.

# 'ఇడుపు కాయితం'
## ఫస్ట్ లుక్ విడుదల

సుకుమార్ రైటింగ్స్, బన్నీ వాస్ వర్క్స్ బ్యానర్లపై ప్రియదర్శి, నాగ దుర్గ జంటగా ఓ సినిమా రూపొందుతోంది. ఈ చిత్రానికి సంబంధించిన పూజా కార్యక్రమాలు తాజాగా పూర్తికాగా, అదే సందర్భంగా మూవీ యూనిట్ టైటిల్‌తో పాటు ఫస్ట్ లుక్ పోస్టర్‌ను కూడా విడుదల చేసింది. ఈ చిత్రానికి 'ఇడుపు కాయితం' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఖరారు చేశారు. మేకర్స్ విడుదల చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను చూస్తుంటే, ఇది పల్లెటూరి నేపథ్యంతో కూడిన ఓ స్వచ్ఛమైన ప్రేమకథగా తెరకెక్కుతున్నట్లు అర్థమవుతోంది. పోస్టర్‌లో హీరో, హీరోయిన్ బైక్‌పై ప్రయాణిస్తూ కనిపించడం, హీరోయిన్ సంప్రదాయ దుస్తుల్లో కనిపించడం, చుట్టూ ఉన్న సామాన్లు, గ్రామీణ వాతావరణాన్ని ప్రతిబింబించే అంశాలు కలిపి ఈ చిత్రంలో మధురమైన భావోద్వేగ ప్రేమకథ ఉండబోతోందనే సంకేతాలు ఇస్తున్నాయి. ముఖ్యంగా పోస్టర్‌లో కనిపిస్తున్న విజువల్స్ సినిమాపై ఆసక్తిని మరింత పెంచేలా ఉన్నాయి. వంశీ రెడ్డి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమాకు సురేష్ బొబ్బిలి సంగీతం అందిస్తున్నారు.




# ప్రెగ్నెన్సీ కన్ఫామ్ చేసిన సమంత
# ఇక సినిమాలకు బ్రేక్

టాలీవుడ్ అందాలతార సమంత అభిమానులకు గుడ్ న్యూస్ చెప్పారు. మా ఇంటి బంగారం సినిమా థాంక్యూ మీట్‌లో సమంత మాట్లాడుతూ..తాను మళ్లీ కొన్ని రోజులు గ్యాప్ తీసుకుంటున్నానని ఫ్యాన్స్ క్షమించాలని అన్నారు. మెటర్నిటీ లీవ్స్ కోసం తాను కొంతకాలం సినిమాలకు గ్యాప్ ఇవ్వబోతున్నట్టు చెప్పారు. సమంత నటించిన మా ఇంటి బంగారం సినిమా ఇటీవల విడుదలై మంచి విజయం సాధించింది. ఈ సినిమాలో సమంత నటనపై ప్రశంసలు అందుతున్నాయి.

అయితే ఈ సినిమా ప్రమోషన్స్ లోనే సమంత బేబీ బంప్ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. దీంతో సమంత ప్రెగ్నెన్సీతో ఉందా అని చాలా మంది అనుమానం వ్యక్తం చేశారు. ఇప్పుడు ఎట్టకేలకు సమంత ఆ విషయంపై క్లారిటీ ఇస్తూ ప్రెగ్నెన్సీని కన్ఫామ్ చేశారు. ప్రెగ్నెన్సీ గురించి చెబుతున్న సమయంతో ఆమె ఎంతో సంతోషం వ్యక్తం చేస్తున్నట్టు కనిపించింది. పక్కనే తన భర్త రాజ్ నిడమూరు కూడా కూర్చుని ఉండగా ఆయన సైతం మురిసిపోయారు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవ్వడంతో అభిమానులు, ప్రేక్షకులు సమంతకు కంగ్రాట్స్ చెబుతూ కామెంట్స్ చేస్తున్నారు.



# ఊచకోతకు శ్రీకారం

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా డైరెక్టర్ సుజీత్ దర్శకత్వంలో వచ్చిన స్టైలిష్ యాక్షన్ ఎంటర్టైనర్ ఓజీ. పవర్ స్టార్ ఫ్యాన్స్ ఆకలి తీర్చిన ఈ సినిమాకు సీక్వెల్ తెరకెక్కుతోందని గత కొంతకాలంగా వార్తలు వినిపిస్తూనే ఉన్నాయి. అయితే ఈ విషయాన్ని అధికారకంగా ప్రకటించారు మేకర్స్. “తుఫాను రావడానికి ముందు.. అక్కడ కొంత నిశ్శబ్దం ఉంటుంది. గంభీర యొక్క అన్‌టోల్డ్ స్టోరీ ఇప్పుడు విప్పబడటానికి సిద్ధంగా ఉంది“ అని క్యాప్షన్ ను జతచేస్తూ ఓజీ 2 అనౌన్స్ చేసారు మేకర్స్.

మొదటి భాగంలో కేవలం పవన్ కళ్యాణ్ స్వాగ్ మరియు స్టైల్ తో మ్యాజిక్ చేసిన సుజీత్ ఈసారి కథపై మరింత దృష్టి పెట్టారు. ఈ ప్రీక్వెల్ స్టోరీలో సుజీత్ కొత్త క్యారెక్టర్లను పరిచయం చేయబోతున్నారు. జపాన్‌లో 'ఓజాస్ గంభీర' సృష్టించిన అసలు విధ్వంసం ఏమిటి? అతను గ్యాంగ్‌స్టర్‌గా ఎలా ఎదిగాడు? అనే కోణంలో ఈ సినిమా ఉండబోతోంది. దర్శకుడు సుజీత్, పవన్ కళ్యాణ్ కాంబోలో రాబోతున్న ఈ సినిమా కేవలం పార్ట్ 2తో సరిపెట్టకుండా ఓజీ యూనివర్స్ ను తీసుకురాబోతున్నారు. ఓజీ 2' నిర్మాణ బాధ్యతల నుండి డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్స్ తప్పుకుంది. ఈ క్రేజీ యూనివర్స్ ప్రాజెక్ట్‌ను పవన్ కళ్యాణ్ సొంత నిర్మాణ సంస్థ 'పవన్ కళ్యాణ్ క్రియేటివ్ వర్క్స్' పతాకంపై నిర్మించబోతున్నారు. థమన్ ఈ సినిమాకు సంగీతమే అందించబోతున్నాడు. ఓజీ యూనివర్స్ అప్‌డేట్‌తో పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ అభిమానుల్లో పూనకాలు మొదలయ్యాయి. మరి సుజీత్ ఈ సారి సృష్టించబోయే విధ్వంసం ఎలా ఉండబోతుందో జస్ట్ వెయిట్ అండ్ వాచ్.




# కెరీర్‌లోనే
## అత్యధిక బడ్జెట్‌తో?

స్వీయ దర్శకత్వంలో హీరో రామ్ పోతినేని నటిస్తున్న సినిమా త్వరలో పట్టాలెక్కనున్న విషయం తెలిసిందే. 'రాపో23' వర్కింగ్ టైటిల్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నారు. తొలిసారి తాను దర్శకత్వం వహిస్తున్న సినిమా కావడంతో ఈ ప్రాజెక్ట్‌పై రామ్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారట. జాతీయ స్థాయిలో పేరుపొందిన సాంకేతిక నిపుణుల్ని తీసుకునే ఆలోచనలో ఉన్నారని తెలుస్తున్నది.

ప్రస్తుతం సీనియర్ ప్రొడక్షన్ డిజైనర్ ఏ.ఎస్.ప్రకాష్ ఆధ్వర్యంలో హైదరాబాద్ శివారు ప్రాంతంలో సెట్స్‌ని తీర్చిదిద్దుతున్నారు. తాజా సమాచారం ప్రకారం దాదాపు 100కోట్ల వ్యయంతో ఈ చిత్రాన్ని నిర్మించనున్నట్లు తెలిసింది. రామ్ కెరీర్‌లోనే అత్యధిక బడ్జెట్ ఇదని, వీర పాత్రలో ఆయన సరికొత్త అవతారంలో కనిపిస్తారని మేకర్స్ చెబుతున్నారు. 'రాపో' సినిమాటిక్స్ పతాకంపై కృష్ణ పోతినేని ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

